క్లుప్తంగా

దళితుల హక్కుల రక్షణకు సంతకాల సేకరణ



సంతకాల సేకరణ చేపడుతున్న దళిత సంఘాల నాయకులు

కల్లూరు: దళితుల హక్కుల రక్షణ కోసం ఉద్యమించాలని కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు కోరారు. ఆదివారం కల్లూరు అర్బన్ ముజఫర్‌నగర్‌లో దళితుల హక్కుల రక్షణకై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు సుధాకరప్ప, కేవీపీఎస్ నగర కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలైనా దళితులను అణగారిన వర్గాలుగానే చూడడం ఆనవాయితీగా మారిందన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, ఆనందు, దావీదు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో సూచించారు. స్థానిక మండల భవిత కేంద్రం ప్రతి సోమవారం దివ్యాంగులకు శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్ ఫిజియోథెరపీ నిర్వహిస్తారన్నారు. దివ్యాంగులను భవిత కేంద్రానికి తీసుకవచ్చి ఫిజియోథెరపీ చేయించుకోవాలని సూచించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు సిటీ: డిసెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్ పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలోని స్కూల్‌లో జరిగిన మహాసభల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కరువు జిల్లాగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో అన్ని రకాల ఫీజులను రద్దు చేసి, ప్రభుత్వమే ఫీజులను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అమర్, పరుశరాం, అంజి, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశామని ఎస్ఐ మన్మథ్‌విజయ్ తెలిపారు. సమాచారం మేరకు సిబ్బందితో కలిసి గ్రామంలో పలు ప్రాంతాలలో సోదాలు నిర్వహించామన్నారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.2,300 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

రచనలతో సమాజాన్ని జాగృతం చేయాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: సమాజాన్ని జాగృతం చేసేలా రచనలు ఉండాలని పలువురు సాహితీ వేత్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం కర్నూలులోని మద్దూర్ నగర్ తెలుగు తోటలో ప్రముఖ కథా రచయిత జి.ఉమామహేశ్వర్ రచించిన 'నెమలీకలు – నెమరువేతలు' (శ్రీశైలం ప్రాజెక్టు హైస్కూల్ కథలు) పుస్తక పరిచయ సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ కవి వెంకటకృష్ణ మాట్లాడుతూ విలువలు తెలియజేసేలా ఈ పుస్తకం ఉందన్నారు. కథలు సమాజానికి విలువలు బోధిస్తాయన్నారు. బాల సాహిత్య రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీశైలం ప్రాజెక్టు పూర్వ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయితలు ఎంఎస్‌డీ ఇనాయతుల్లా, తెలకపల్లి మధుసూదనశర్మలు పుస్తక సమీక్ష చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం : మండల కేంద్రంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైనట్లు హైవే పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాల మేరకు బేతంచెర్లకు చెందిన ప్రతాప్ పెయింట్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం బైక్‌పై నంద్యాలకు వెళ్తుండగా రహదారి పక్కన నిలిచివున్న ట్రాయిలర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన ప్రతాప్‌ను చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు.

నేడు సంగీత నీరాజనం

కర్నూలు కల్చరల్: టూరిజం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో సోమవారం సాయంత్రం 4 గంటల సంగీత నీరాజనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి విజయ ఆదివారం తెలిపారు. విజయవాడలో డిసెంబర్ 10 నుంచి 12 తేదీ వరకు జరగబోవు కృష్ణవేణి సంగీత నీరాజనం మ్యూజిక్ ఫెస్టివల్‌కు ముందస్తు కార్యక్రమాలుగా సంగీత నీరాజనాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

శైవాలయాల్లో కార్తీక సందడి

- కిటకిటలాడిన భోగేశ్వర ఆలయ ప్రాంగణం
- కొత్తూరుకు పోటెత్తిన భక్తులు



కొత్తూరు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరాలయం భక్తులతో కళకళలాడింది. కార్తీకమాసం, ఆదివారం కావడంతో వందలాది మంది భక్తులు భోగేశ్వరానికి తరలివచ్చారు. అభిషేక ప్రియుడైన ఈశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయ ఈఓ చంద్రశేఖరరెడ్డి, చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డిలు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామివారిపై పడే సూర్యకిరణాలను దర్శించు కోవడానికి బారులుదీరారు. కార్తీకమాసం ,ఆలయ విశిష్టత గురించి ఆలయప్రధాన అర్చకులు శ్యాంసుందరశర్మ భక్తులకు వివరించారు. భక్తులకు కాశీరెడ్డినాయన ఆశ్రమంలో ఉచిత అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు.

కొత్తూరు భక్తులతో కిటకిట

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లీసుబ్రహ్మణ్యేశ్వస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాసం రెండవ ఆదివారం కావడంతో భక్తులు తండోపతండలుగా తరలివచ్చారు. తెల్లవారుజామున నుంచే ఆలయానికి క్యూకట్టారు. స్వామి వారికి ఇష్టమైన చలువపిండి తయారు చేసి నైవేద్యం సమర్పించారు. అధికారుల ఏర్పాటు చేసిన క్యూలైన్లు ఉదయం 8గంటలకే నిండిపోయాయి. మహిళలు ఆలయం ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు.

450 అభిషేకాలు.. : కార్తీక మాసం రెండో ఆదివారం పురస్కరించుకొని ఒక్క రోజే 450 అభిషేకాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. తెల్లవారుజామున 4గంటల నుంచి ప్రారంభమైన మహాపూజలు సాయంత్రం వరకు కొనసాగాయి. అధికారులు లెక్కల ప్రకారం సాయంత్రం వరకు 30వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారన్నారు.



భోగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న భక్తులు



పుట్టాలమ్మ ఆలయంలో భజనలు చేస్తున్న గ్రామస్తులు

పుట్టాలమ్మలో కార్తీక వనభోజనాలు

మండల పరిధిలోని నెరవాడ గ్రామ పొలిమేరలో వెసిన శ్రీ పుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో భజన కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారికి అభిషేకలు, నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో వనభోజన కార్యాక్రమం నిర్వహించారు.

నేడు 'స్పందన'

కల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ టీవీ రమేష్ బాబు తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీలను సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి మండల అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ శేషఫణి ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్పందనకు గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే స్పందనను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోడుమూరు రూరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పా ల్గొంటారని, ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యవసాయంపై అవగాహన పెంచుకోండి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): ఇన్‌పుట్ డీలర్లు వ్యవసాయ చట్టాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల క్వాలిటీ కంట్రోల్‌కు సంబంధించిన విషయాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమా కోర్సు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై క్విజ్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... వ్యవసాయ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకునేందుకు దేశీ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డీలర్లు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత జేడీఏ, దేశీ సమన్వయకర్త జయచంద్ర, జిల్లా వనరుల కేంద్రం ఏవో శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

హాస్యం మనిషికి టానిక్ లాంటిది



కళాకారులతో విశ్రాంత కలెక్టర్ బలరామయ్య, కళాక్షేత్రం సభ్యులు

కర్నూలు కల్చరల్: హాస్యం మనిషికి టానిక్‌లా పని చేస్తుందని కళాకారులు, విశ్రాంత కలెక్టర్ జి.బలరామయ్య అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో 'ఏడనున్నాడు ఎక్కడున్నాడు' హాస్య నాటిక ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా బలరామయ్య నాటక దర్శకులు షఫీని సత్కరిస్తూ కళాక్షేత్రం తరపున రూ.20 వేలు నగదు పారితోషికం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సాంఘిక నాటకాలు సమాజానికి దర్పణం లాంటివి అన్నారు. కళాక్షేత్రం అధ్యక్షు లు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ప్రతి నెల చివరి ఆదివారం సాంఘిక నాటకం ఉంటుందని చెప్పారు. అంతకు ముందు లలితా కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.వి.చలపతి రావు చిత్రపటానికి పుష్పమాల సమర్పించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. చిలకలూరిపేట అమ్మేచూర్ డ్రమెటికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నాటక ప్రదర్శనలో మాధవి, హరిబాబు, శివరాం, ప్రసాద్, నారాయణరావు, షఫీల నటన ప్రేక్షకులను కడుపుబ్బనవ్వించింది. కార్యక్రమంలో కార్యదర్శి మహమ్మద్ మియా, ఉపాధ్యక్షులు ఇనాయతుల్లా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీనివాసనాయక్ మృతిపై విచారణ జరిపించండి



మాట్లాడుతున్న కైలాస్‌నాయక్

కర్నూలు(అర్బన్): అనంతపురం జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసనాయక్ మృతిపై విచారణ జరిపించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కైలాస్‌నాయక్ కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీనివాసనాయక్ కుటుంబ సభ్యుల అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. ఒత్తిళ్లు, బెదిరింపులను తట్టుకోలేక అనేక మంది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. అనేక మంది బయటకు చెప్పుకోలేక తమలో తామే బాధలను దిగమింగుకొని ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షులు కేతావత్ లక్ష్మణ్‌నాయక్, ఉద్యోగ సంఘం నాయకులు నేనావత్ రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ గౌరధ్యక్షురా లు నిర్మలమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ డిమాండ్ చేశారు. డిసెంబర్ 8న తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ

కర్నూలు (టౌన్) : విద్యార్థులు చెడు వ్యసనాల కు దూరంగా ఉంటూ క్రమశిక్షణ కలిగిన పౌరులుగా రాణించాలంటే క్రీడల వల్లే సాధ్యమని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నా రు. ఆదివారం స్థానిక పెద్దమార్కెట్ వద్ద ఉన్న మున్సిపల్ పార్కులో తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం తైక్వాండో లాంటి క్రీడలు అవసరమన్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయడం వల్ల ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. అనంతరం బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు కలర్ బెల్ట్‌లు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.

కేసీకి జలం.. పైర్లకు జీవం

- ఎమ్మెల్యే చొరవతో కాలువకు నీటి విడుదల
- కృతజ్ఞతలు చెబుతున్న రైతన్నలు



పెసరవాయి గ్రామం వద్ద కేసీ కాల్వలో పారుతున్న నీరు



తిరుపాడులో సాగునీరు అందడంతో కళకళలాడుతున్న జొన్న పైరు

గడివేముల: మండల పరిధిలోని కేసీ ఆయకట్టు కింద చిందుకూరు, పెసరవాయి, గడిగరేవుల, కరిమద్దెల, తిరుపాడు, కొరటమద్ది గ్రామాల్లో రైతులు మినుము, జొన్న పంటను సాగు చేశారు. పంట బాగా ఉందని ఈసారి మంచి దిగుబడులు వస్తాయని అనుకున్న సమయంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా కేసీకి నీరు ఆగిపోయింది. దీంతో ఆందోళన చెందిన రైతులు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో మాట్లాడి కేసీకి నీటిని విడుదల చేయించారు. దీంతో ఆయకట్టు రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

జొన్న పంటకు ప్రాణం



గడిగరేవుల గ్రామంలో ఎక్కువ మంది రైతులు జొన్న పంటను సాగుచేశారు. పంట బాగా ఉందనుకుంటున్న సమయంలో కేసీకి నీరు రాకపోవడంతో క్రమంగా పైరు వాడు పట్టింది. రైతుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పందించి.. అధికారులతో మాట్లాడి కాలువకు నీటిని విడుదల చేయించారు. ఈ నీటితో జొన్న, మినుము పంటలకు ప్రాణం పోసినట్లయ్యింది. ఎమ్మెల్యే కృతజ్ఞతలు.

–రాచమల్లు గోపాలయ్య, రైతు, గడిగరేవుల

చివరి ఆయకట్టు వరకు సాగునీరు

పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు గడిగరేవుల, తిరుపాడు, కొరటమద్ది, కరిమద్దెల, పెసరవాయి గ్రామాలకు సాగునీరు అందిస్తున్నాం. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు చేశాం. ప్రతి రోజూ రాత్రి వేళల్లో సైతం కేసీ కెనాల్ వెంట తిరుగుతూ ప్రతి రైతుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నాం. ఇంకా రెండు రోజుల పాటు పెసరవాయి కాలువకు నీరు అందిస్తాం.

– విజయ్‌కుమార్, జేఈ, కేసీ కెనాల్

పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రానికి చెందిన విజయ్‌కుమార్‌శర్మ రచించిన శ్రీ వీరనారాయణామృతమ్ పుస్తకాన్ని ఆదివారం స్థానిక శ్రీవీరనారాయణ స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. రచయిత గురువు రంగాచార్యుల చేతుల మీదుగా పుస్తకావిష్కరణ గావించారు. కార్యక్రమంలో బద్రీనాథ్‌రావు, గోపిక్రిష్టారావు, కిట్టయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మెమోలు ఇవ్వడం తగదు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయులు ఏ తప్పూ చేయకపోయినా విద్యాశాఖ అధికారులు మెమోలు, షోకాజ్ నోటిసులు జారీ చేయడం తగదని అప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు అన్నారు. ఆదివారం అప్టా రాష్ట్ర కార్యవర్గ గుగూల్ మీట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క రోజే సుమారు 262 మంది ఉపాధ్యాయులకు చార్జ్ మోమెలు, షోకాజ్ నోటిలులు ఇవ్వడం ఆందోళనకు గురి చేస్తోందన్నారు. దీనిపై పోరాటాలకు సిద్ధం అవుతున్నామని చెప్పారు. అధికారులు స్పందించి మోమెలను, నోటిసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

10న కాంట్రాక్ట్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలు

కర్నూలు(సెంట్రల్) : డిసెంబర్ 10వ తేదీన విజయవాడలో నిర్వహించే కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర ప్రధానకార్యదర్శి అల్లం సురేష్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలులోని రెవెన్యూ భవన్‌లో రాష్ట్ర స్థాయి మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వి.గిరికుమార్‌రెడ్డి, నాయకులు వై.కృష్ణ, దాసన్న, ఎస్‌కే మస్తాన్ పాల్గొన్నారు.

15 నుంచి రైతు సంఘం జాతీయ సమావేశాలు

కర్నూలు(సెంట్రల్): డిసెంబర్ 16,16,17 తేదీల్లో కర్నూలులో నిర్వహించే రైతు సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.నిర్మల, డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఒకటో జోన్ సర్వసభ్య సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చి అమలు చేయలేకపోయిందన్నారు. కేవీ నారాయణ, రాజగోపా,సుంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ లష్కర్ మృతి

కర్నూలు సిటీ: తుంగభద్ర దిగువ కాలువ కోడుమూరు సబ్ డివిజన్‌లో లష్కర్‌గా ఉంటూ జలవనరుల శాఖ కర్నూలు ప్రాజెక్టు సీఈ కార్యాలయంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న మిద్దె పెద్ద రాముడు ఆదివారం తెల్లవారుజామున తన స్వగ్రామమైన ప్రాతకోటలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఈ ఆఫీస్ సూపరింటెండెంట్ కమలాకర్, స్టెనో వెంకటేశ్వర్లు, లష్కర్ల సంఘం నాయకులు గ్రామానికి వెళ్లి భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆఫీస్ తరుపున కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని లస్కర్ల సంఘం అధ్యక్షులు నాగన్న కోరారు.

ఉల్లాసంగా కార్తీక వన భోజనాలు

నంద్యాల(అర్బన్): స్థానిక ప్రథమనందీశ్వర స్వామి ఆలయ ఆవరణంలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో ఆదివారం అఖిల భారత రజక సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం ఉల్లాసంగా సాగింది. అలాగే రజక వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేశారు. అనంతరం మ్యూజికల్ చైర్, కబడ్డీ, తాడాట తదితర పోటీలతో పాటు పది, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులకు సన్మానం, మెమొంటోలను అందజేశారు. సంఘం నాయకులు సుబ్బారావు, జిల్లెల్లె శ్రీరాములు, రోశన్న, రామమద్దిలేటి పాల్గొన్నారు. అలాగే.. స్థానిక భీమలింగేశ్వరస్వామి దేవస్థానంలో వీరశైవ సేవా సంక్షేమ సమాజం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడు నాగరాజు, వీరశైవులు శివప్ప, మల్లప్ప, శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికీ హక్కులు





కల్లూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని ఎదురూరు గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు ఆదివారం కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి రాజ్యాంగం హక్కులు కల్పించిందని, ఆ హక్కుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ బద్ధమైన పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమానంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఇలాంటి పాలనతో ప్రజలందరు సంతోషంగా ఉండడంతోనే పెత్తందారులు చూసి తట్టుకోలేకనే ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, రేమట ఎస్.సంపత్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, ఎంఆర్‌పీఎస్ నాయకులు సామేలు, అబ్రహం, తొలిశాపురం రంగన్న, సుంకేసుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘనంగా నివాళి

పాణ్యం : దేశంలోని ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవాలని వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, కో- ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్ అన్నారు. ఆదివారం రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఏ.వి.రమణ, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, సచివాలయ కన్వీనర్ రాజన్న, బాబి, సత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

కల్లూరు: భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఆదివారం కల్లూరు అర్బన్ 33వ వార్డులోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళ ఐక్యవేదిక నాయకురాలు పట్నం రాజేశ్వరి, ఎమ్మార్పీఎస్ పాముల కుమార్ పూలమాల వేసి నివాళుర్పించారు.

కోడుమూరు రూరల్ : రాజ్యాంగ దినోత్సాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కోడుమూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆంధ్రయ్య, మండల అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ భారతదేశానికి దిశా నిర్దేశాన్ని కల్పించినటువంటి రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తహసీల్దార్ కార్యాలయంలో ..

కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ జయన్న వీఆర్వోలతో కలిసి డా.బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం, డా.బీ.ఆర్. అంబేడ్కర్ గొప్పతనాన్ని, లక్ష్యాలను తహసీల్దార్ వివరించారు.



పాణ్యంలో అంబేద్కర్ విగ్రహాలనికి పూలమాల వేస్తున్న దృశ్యం

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

సి.బెళగల్: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి సిబ్బందితో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జయప్రకాష్, సి.బెళగల్ పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

గొప్ప దార్శనికుడు బాబా సాహెబ్

కల్లూరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం 74వ రాజ్యాంగ ఆమోద దినోత్సవ సందర్భంగా కల్లూరు అర్బన్ 33వ వార్డులోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కాటసాని, ఎస్సీ విభాగం నాయకులు, ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భారత రాజ్యాంగ రూపశిల్పి అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. మంత్రి వర్గంలో 75శాతం బడుగు, బలహీన వర్గాలకు, నామినేటడ్ పదవుల్లో 50శాతం రిజర్వేషన్, స్థానిక సంస్థలలో మహిళలకు 50 శాతం పదవులు కేటాయించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నరసింహులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, శ్వేతారెడ్డి, నారాయణరెడ్డి, కల్లూరు అర్బన్ జేసీఎస్ హనుమంతురెడ్డి, నంద్యాల పార్లమెంటరీ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి శివ, మిడ్తూరు శ్రీనివాసులు, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న తహసీల్దార్ జయన్న



కోడుమూరులో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు